# దీప్తం

**మా** మెడికల్ కాలేజీ బస్సు నాన్న పనిచేసే ఆస్పత్రి ముందే ఆగుతుంది. ఆస్పత్రి వెనక కొద్దిదూరంలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో మేం ఉంటున్నాం. నాన్నతో పనిచేస్తున్న వాళ్ళు చాలామంది సొంత ఇళ్ళు కట్టుకుని వెళ్ళిపోయారు. ఆయన ఆస్పత్రి దగ్గరయితే స్థలం కొన్నారు కాని మా చదువుల వలన కట్టలేకపోయారు. మా చదువులు పూర్తయి ఉద్యోగాల్లో చేరాక ఇల్లు కట్టడం మొదలెడతారేమో.

మరో సంవత్సరం గడిస్తే నా మెడిసిన్ పూర్తవుతుంది. చెల్లాయి వరంగల్‌లో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టలులో ఉంటూ వారానికి ఒకసారో, రెండు వారాలకు ఒకసారో వచ్చి వెళ్తుంటుంది. దానికి అమ్మంటే ప్రేమ, నాకు నాన్నంటే ప్రేమ.

నాన్న ఆస్పత్రిలో ఎకౌంట్సు విభాగంలో సీనియర్ ఎకౌంటెంటుగా ఉద్యోగం చేస్తున్నారు. మరో అయిదారేళ్ళు సర్వీసు ఉంది. సంవత్సరం కిందటి వరకు ఆరోగ్యంగానే ఉన్నారు. మధుమేహం ఉన్నా వ్యాధిని మందులు వాడుతూ నియంత్రణలో ఉంచుకునేవారు. అంత జాగ్రత్తగా ఉన్నా ఒక మూత్రపిండం పూర్తిగా దెబ్బతిన్నాక దాన్ని తీసేశారు. ఆరు నెలలపాటు ఆస్పత్రిలో ఉన్నారు. ఉద్యోగులకయ్యే వైద్యఖర్చును సంస్థవాళ్ళే భరిస్తారు.

ఈ మధ్య ఎక్కడ ఏ పొరపాటు జరిగిందో ఏమో రెండో మూత్రపిండం కొంతమేర దెబ్బతింది. మందులు తీసుకుంటున్నా డయాలిస్ తప్పడం లేదు. మూత్రపిండం మార్పిడి అవసరం అనిపించింది. చీఫ్ మెడికల్ ఆఫీసరు దగ్గరకు వెళ్ళి అడిగాను. "గాభరా పడాల్సినంత అవసరసం లేదమ్మా. చూస్తూండు. రెండు మూడు వారాల్లో మీ నాన్న కోలుకుంటారు". ఆయన మాటలు నాకెంతో ఊరటనిచ్చాయి. రోజులు గడుస్తున్నాయి కాని నాన్న ఆరోగ్యం మెరుగేం కాలేదు. డోనరు కోసం వెతకటం ప్రారంభించాను.

ప్రతి ఉదయం కాలేజీకి వెళ్ళేముందు అరగంటపాటు నాన్న దగ్గర కూర్చుని వెళ్తుండేదాన్ని. ఆ ఉదయం పనుల తొందర్లో ఆస్పత్రికి వెళ్ళడం పడలేదు. ఆ

బి.పి.కరుణాకర్

సాయంత్రం అయిందిటికి మా బస్సు ఆస్పత్రి ముందు ఆగగానే బస్సు దిగి ఆస్పత్రిలో ప్రవేశించి రిసెప్షన్ డెస్క్ దాటుతోంటే,

"లలితా, ఒక్క నిమిషం" అంది రిసెప్షనిస్టు.

ఆగి, ఆమె దగ్గరకు వచ్చాను.

"నువ్వు రాగానే డాక్టరు శాంతారాం వచ్చి కలవమన్నారు" అంది.

ఆయన నెఫ్రాలజిస్టు. నాన్న ఆయన పర్యవేక్షణలో ఉన్నారు.

"ఇప్పుడున్నారా?" అడిగాను.

"ఉన్నారు. అయిదూ, పది నిమిషాల్లో వెళ్ళిపోతారు."

ఆయన మరో మూడు ఆస్పత్రుల్లో కన్సల్టెంట్‌గా ఉన్నారు.

ముందుకువంగి, "నాన్న విషయమా? " అని అడుగుతోంటే నాగుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది.

"అనుకుంటాను." అంది.

పక్క నడవలోనే శాంతారాం గది ఉంది. నా ముందే ఒక పేషెంటు ఆయన గదిలోకి వెళ్ళాడు. శాంతారాం మంచి పేరున్న డాక్టరు. పేరుకు తగిన మనిషేం కాదు. పేషంట్ల మీద విసుక్కుంటూ ఉంటాడు. రెండుచేతులా ఎంతో సంపాదిస్తున్నా ఏదో పోగొట్టుకున్నవాడిలా కనిపిస్తుంటాడు. ఈ మాటే ఒకసారి నాన్నతో అంటే 'ప్రేమ వివాహం వలన అయి ఉండొచ్చు' అన్నాడు నవ్వుతూ.

పేషంటు ఆయన గదిలోంచి బయటకు వచ్చాక నేను లోపలికి నడిచాను.

"కూర్చోమ్మా" బల్లకు ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాడు.

కూర్చోవాలనిపించడం లేదు. ఆయనతో మాట్లాడడానికి నేను జంకుతుంటాను. ఆయనేం చెప్పబోతున్నాడో ఆలోచించడానికి భయం వేస్తోంది. సీరియస్ విషయాలను అతి సామాన్యమయిన సంగతుల్లా చెబుతుంటాడు. తన ముఖంలో ఎటువంటి భావం కనిపించనీయడు. అంతకు ముందు అలా ఉండేవాడు కాదని, పెళ్ళయిన తర్వాతే ఆయన అలవర్చుకున్నాడని అన్నాడు.

కూర్చున్నాను. నా గుండె వేగంగా కొట్టుకోవడం నాకు వినిపిస్తోంది. నా చేతులు చల్లబడుతున్నట్టు అనిపించసాగింది. నాన్నకు ఏమీ కాకూడదు. ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగు పడాలి. నా దృష్టి ఆయన మీదే ఉంది.

ఆయన గదిలోంచి బయట పడే ప్రయత్నంలో ఉన్నాడు. ఏవో రిపోర్టులను, కాయితాలను బ్రీఫ్‌కేసులో సర్దుకుంటూ, నా వయిపు చూడకుండా, "గంటకిందటే మీ నాన్నగారికి డయాలిసిస్ చేశాం. కిడ్నీ డోనరు సంగతి ఏమయింది?" అడిగాడు.

"ఇద్దరు ముందుకువచ్చి ఎంచాతో వెనక్కి వెళ్ళిపోయారు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా జవాబు ఇవ్వడం లేదు. నా కిడ్నీ తీసుకుంటే ఏమవుతుంది?"

తలెత్తి నా కళ్ళల్లోకి చూసి తల అడ్డంగా ఆడించాడు. 'ఎందుకు?' అని నేను అడిగేలోపల, "చాలా కాలం నుండి మందులు వాడుతూండడం వలనో మీ నాన్నగారి శరీరం 'టాక్సీన్' అయింది. మందులకు ఆయన శరీరం రెస్పాండ్ కావడం లేదు. ఏరోజుకారోజు ఈ విషయం నీతో చెప్పాలనే అనుకుంటున్నాను. కాని చెప్పలేకపోతున్నాను. నిన్న మీ అమ్మగారితో చెపుదామనుకున్నాను. చెప్పలేకపోయాను. రేపోమాపో డాక్టరువి కాబోతున్న నువ్వు అర్థం చేసుకున్నావనే అనుకున్నాను. నువ్వు గమనించే ఉండొచ్చు. మా ప్రయత్న లోపం ఏమీ లేదు...." ఆగి, "మహా అయితే... "మాట పూర్తి చేయకుండా లేచి నిలబడి బ్రీఫ్‌కేసు అందుకున్నాడు.

దుఃఖం ఆపుకోలేకపోతున్నాను. ఆయన్నుండి ఆ మాటలు వింటానని నేను ఊహించలేదు. కాళ్ళూ చేతులు వణుకుతున్నాయి.

ఆయనగదిలోంచి వెళ్ళిపోబోతూ నా పక్కనే ఆగి నా తల నిమిరి, "ఏ సహాయం కావాలని వచ్చినా నాకు ఫోన్ చేయి" అని వెళ్ళిపోయాడు. నాలో వెలుగు కరిగిపోతున్నట్టు అనిపించసాగింది. దుఃఖం కట్టలు తెంచుకుంది. పదినిమిషాలపాటు ఆ గదిలో కూర్చుని ఒంటరిగా ఏడుస్తూ ఉండిపోయాను.

తేరుకున్నాక లేచి నాన్న ఉన్న గదిలోకి వెళ్ళి, మంచం పక్కగా స్టూలు లాక్కుని కూర్చుని, "నాన్నా" పిలిచాను. నిన్నటికన్నా నీరసించిపోయినట్టనిపిస్తోంది. కళ్ళు తెరిచాడు.

"ఎలా ఉంది?" అడిగాను.

"ఈ సాయంత్రం డయాలసిస్ చేశారు" అన్నాడు.

అలాగా అన్నట్టు తలాడించాను. శాంతారాం. నాతో మాట్లాడినట్టు చెప్పదల్చుకోలేదు. ఆయన్ని చూస్తోంటే వస్తున్న దుఃఖాన్ని గొంతులోనే తొక్కి పెడుతున్నాను. బయటకు రానీయడం లేదు.

నాన్న చామనచాయలో ఎంతో కళగా ఉండేవారు. ఇప్పుడా కళేం లేదు. నల్లబడిపోయారు. నాతో, చెల్లెలితో నవ్వుతూ, నవ్విస్తూ మమ్మల్ని కూతుళ్ళుగా కాదు, స్నేహితుల్లా చూశారు. ఏ విషయంలోనూ మాకూ తక్కువ చేయలేదు. పండగలకూ పబ్బాలకు మాకు ఖరీదయిన గుడ్డలు కొనిచ్చి తను మాత్రం సాదావి తీసుకునేవారు. అమ్మకు కూడా మంచివే తీసుకునేవారు. అదేమిటని అడిగితే, 'మీరు కాలేజీలకు వెళ్తున్నవాళ్ళు, మీకు మంచి బట్టలుండాలి. నా కెందుకర్రా? కొద్దోగొప్పో మిగిలిందనుకో ఆ డబ్బులతో మీకు మరో జత వస్తుంది కదూ?' అనేవాడు. మా బాగోగులు చూసుకోవడంలో అమ్మా నాన్న పోటీ పడేవారు.

ఇహ ఆయన మాతో ఉండరు. కనిపించరు. మాటలు వినబడవు. ఆ నవ్వు చూడను.

"నాన్నా".

"ఊ".

"ఒక్క మాట అడుగుతాను".

"అడుగు".

"మీరేమీ అనుకోవద్దు".

తల అడ్డంగా ఆడించాడు.

"కిడ్నీ మార్పిడికి నేనూ చెల్లాయి ముందుకు వస్తోంటే ఎందుకు ససేమిరా అంటున్నారు? ఒకటీ రెండు పరీక్షలు చేశారు. ఏదీ ఎందుకు మేచ్ కాలేదు?"

"కొన్ని కేసుల్లో మేచ్‌కావు".

"డి.ఎన్.ఏ. చేయించొచ్చు కదా?"

"టిష్యూ, తదితర మేచ్ కానప్పుడు డి.ఎన్.ఏ. తో లాభం ఉండదు. నెగిటివ్ అవుతుంది..." అని కొద్దిసేపు మవునంగా ఉండి, "ఈ విషయాలు నాకంటే నీకు ఎక్కువ తెలిసి ఉండాలి. కదా?" ఆగి ఏదో చెప్పబోయి చెప్పలేదు.

"మీరేదో దాస్తున్నారు."

అవుననలేదు, కాదనలేదు.

"చెప్పాలని లేకపోతే వద్దు."

తల అడ్డంగా ఆడించి, 'అదేం లేదు. చెప్పాలి" అని గుండె నిండా ఊపిరి పీల్చుకుని చెప్పడం మొదలెట్టాడు. "మీ ఇద్దరూ మా పిల్లలు కాదమ్మా, మీరు మాకు

పుట్టలేదమ్మా, మిమ్మల్ని చిన్నప్పటినుండి దరి చేర్చుకుని పెంచి చదువులు చెప్పించి పెద్ద చేశాం. నిజానికి మీకు మేము ఏమీ కాము..."అంటున్నప్పుడు ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

భవనం కూలి శకలాలు నామీద పడుతున్నట్టు అనిపించసాగింది. ఆయన చెబుతోంది నమ్మాలనిపించడం లేదు. ఈ విషయం అబద్ధమయితే ఎంత బావుణ్ణు.

"ఈ విషయాన్ని ఇన్ని సంవత్సరాలు ఎందుకు దాచారు?" ఏడుస్తూ అడిగాను.

"తెలుసుకుని నువ్వు చేయగలిగిందేమీ ఉండదమ్మా. తెలియక పోతేనే నీ మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇరవయి మూడు సంవత్సరాల కిందటి మాట. ఈ ఆస్పత్రిలో ఒక రాత్రి అయిదు కాన్పులు జరిగాయి. ఒక తల్లికి నువ్వు పుట్టావు. పుట్టిన పిల్లల చేతికి 'టేగ్'లు కట్టడంలో డ్యూటీలో ఉన్న నర్సు, ఆయాలు చేసిన పొరపాటు వలన అందరూ కాదు, నువ్వూ మరో బాబు మారడం జరిగింది. నువ్వు వెళ్ళాల్సిన ఇంటికి ఆ బాబు, ఆ బాబు వెళ్ళాల్సిన ఇంటికి నువ్వు వెళ్ళారు. పొరపాటు తెలుసుకున్న వెంటనే ఆస్పత్రి సిబ్బంది మీ తల్లిదండ్రుల నుండి ఆ బాబును తీసుకువచ్చి వాడి తల్లిదండ్రులకు అప్పగించారు. నిన్ను తీసుకెళ్ళి మీ తల్లిదండ్రుల కివ్వబోతే 'మా పిల్లకాదు. మాకు వద్ద'న్నారు. ఎన్నివిధాలుగా చెప్పినా వినలేదు. మనసు మార్చుకుని నాలుగయిదు రోజుల తర్వాత వస్తారని ఎదురు చూశాం. రాలేదు. వారం, రెండు వారాలు, నెలా, రెండు నెలలు అయినా రాలేదు. మా ఆస్పత్రి నుండి మనుషులను పంపిస్తే ఇల్లు మారారని, ఎక్కడికి మారారో తెలియదనే సమాచారంతో తిరిగి వచ్చారు. ఆడపిల్లవు కాబట్టి వాళ్ళకు నువ్వొద్దు. అంతే. మేము నిన్ను పెంచుకోవడానికి తీసుకున్నాం. ఆస్పత్రుల్లో వదిలేసిన పిల్లలను వేరే ఎవరయినా పెంచుకోవడానికి ఇప్పుడున్నన్ని ఆంక్షలు, రూల్సు అప్పట్లో లేవు. ఇంకో సంగతేమింటే, ఆడపిల్లల్ని పెంచుకోవడానికన్నా మగపిల్లల్ని పెంచుకోడానికి ఎవరో ఒకరు ముందుకు వచ్చేవారు. నాకూ అమ్మకు అటువంటి తేడాలు లేవు. ఇప్పుడు నువ్వు చెల్లెలు అనుకుంటున్న పాప నీకు చెల్లెలు కాదు. ఎవరో ఆస్పత్రిలోనే కని చెత్తకుండీలో వదిలి వెళ్ళిపోయాన పసిగుడ్డును తీసుకొచ్చి నీతోపాటు పెంచాం. మీరుండగా మాకు పిల్లలు కావాలని కోరుకోలేదు. మిమ్మల్ని బాగానే పెంచామనే అనుకుంటున్నాం....." ఆగాడు.

కొద్దిసేపు ఆగి, "నువ్వు అడిగావు కాబట్టి ఇవన్నీ చెప్పాల్సి వచ్చింది. పాప తల్లిదండ్రులు ఎవరో నాకు తెలియదు. కానీ నీ తల్లిదండ్రులు ఎవరో, ఎక్కడ ఉంటున్నారో నాకు తెలుసు, అమ్మకు తెలియదు. నువ్వు నా దగ్గర ఉంటున్న సంగతి వాళ్ళకు తెలియదు. నీకు ఇష్టమనిపిస్తే నువ్వు మీ వాళ్ళ దగ్గరకి వెళ్ళొచ్చు. అతని పేరు.... " అంటోంటే నాన్న నోటికి నా అరచేయి అడ్డం పెట్టాను. అతని గురించి నేనేం వినదలుచుకోలేదు. తల అడ్డంగా ఆడించాను.

బాధలో ఉన్న నాన్న ముందు ఏడవడం ఇష్టం లేక గది పక్కనే ఉన్న బాత్‌రూంలోకి వెళ్ళాను. తలుపు మూసి చాలాసేపటి వరకు ఏడుస్తూ ఉండిపోయాను. తర్వాత ముఖం కడుక్కుని, చున్నీతో తుడుచుకుని, తిరిగి వచ్చి నాన్న దగ్గర కూర్చున్నాను.

గది నిశ్శబ్దంగా ఉంది. గాలి బిగుసుకుపోయినట్టు కిటికీ తెరలు కదలడం లేదు. దిండు పక్కనే ఉన్న బొకేలోంచి తీస్తోంటే, కాడతో సహా గులాబి బయటకు వచ్చింది. ఆ సాయంత్రం పెట్టిన పూలగుత్తి అనుకుంటాను.. పూలు తాజాగా ఉన్నాయి. నాన్నకు గులాబీలంటే ఇష్టం. మా ఇంటి ముంగిట అన్నీ గులాబీ మొక్కలే.

నాన్న ముఖంలోకి చూస్తూ, "నాన్నా" పిలిచాను.

ఆ కళ్ళు నా వంకే దయగా చూస్తున్నాయి. ఆయన పలకలేదు.

నా ఊపిరి ఆగిపోతున్నట్టనిపించి భయంగా తలుపు దగ్గరకు పరుగెత్తి, "సిస్టర్, సిస్టర్.." అరిచి వెంటనే నాన్న దగ్గరకు వచ్చాను. నాన్న కళ్ళల్లోంచి ప్రాణం పోతోంది.

గులాబీ కొమ్మ ఉన్న రెండు చేతులు జోడించి నాన్నకు నమస్కారం చేస్తున్నాను. ఆ ముళ్ళు నా అరచేతుల్లో దిగుతున్నాయి. రక్తం కారుతోంది.

ఆ రక్తం ఎక్కడ నుండి వచ్చిందో నాకు తెలియదు. ఆ ఎవరికో నేను ఏ మాత్రం రుణపడి ఉండలేదు. నా రుణం తీర్చుకోనీయకుండా నాన్న వెళ్ళిపోతున్నాడు. తీర్చుకోవడం నా వలన కాదు.

* విపుల, మాసపత్రిక, జనవరి 2011